అభివృద్ధి వాడ.. దుంబ్రిగుడ

- రూపురేఖలు మారిన రహదారులు
- పాఠశాలల ఆధునికీకరణ
- ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పన
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రగతి పరవళ్లు


దుంబ్రిగుడ పీహెచ్‌సీ భవనం


ఏకలవ్య కళాశాల భవనం

దుంబ్రిగుడ (అరకులోయ టౌన్): అభివృద్ధిలో గిరిజన గ్రామాలు మైదాన ప్రాంతాలతో పోటీ పడుతున్నాయి. ఒకప్పుడు సరైన రహదారులు లేక గిరిజనులు అష్టకష్టాలు పడేవారు. ఇప్పుడు మెరుగైన బీటీరోడ్లు అందుబాటులోకి రావడంతో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. గిరిజన ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు సులభంగా తరలించి విక్రయించుకుంటున్నారు. వీటికితోడు గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాల రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. పోతంగి గ్రామ పంచాయతీ దుంబ్రిగుడలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు మచ్చుకు కొన్ని...

రూ. 20 కోట్లతో దుంబ్రిగుడలో ఏకలవ్య పాఠశాల, కళాశాల నిర్మాణం

దుంబ్రిగుడలో రూ. 20 కోట్లతో ఏకలవ్య పాఠశాల, కళాశాల నిర్మాణం చేపట్టారు. విద్యార్థులకు తరగతి గదులు, వసతి గృహాలు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, సిబ్బందికి నివాసాలు నిర్మించారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. త్వరలో ఈ వసతులు అందుబాటులోకి రానున్నాయి.

రూ.కోటితో దుంబ్రిగుడ నుంచి గుంటసీమకు తారురోడ్డు నిర్మాణం

కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరిన దుంబ్రిగుడ–గుంటసీమ రోడ్డు మరమ్మతులకు గురైంది. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి రూపాయలతో పది కిలోమీటర్ల మేర మరలా తారురోడ్డు నిర్మించారు. మూడు పంచాయతీల ప్రజల రవాణా కష్టాలు తీర్చారు.

రూ.70 లక్షలతో చాపరాయిలో సౌకర్యాల కల్పన

దుంబ్రిగుడలో చాపరాయి వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా సౌకర్యాలు కల్పించారు. రూ.70 లక్షలు వెచ్చించి పనులు చేపట్టి గడువుకు ముందే పూర్తి చేశారు. ఆర్చ్‌తోపాటు ముందు భాగంలో ప్రహరీ నిర్మాణం, విద్యుదీకరణ, పాత్ వేలో టైల్స్ ఫ్లోరింగ్, చాపరాయి లోపల వివిధ రంగులు, డ్రెసింగ్ రూమ్‌లు, మరుగుదొడ్లు, థింసా యాంఫీ థియేటర్, లోపల రైలింగ్, గార్డెన్ అభివృద్ధి, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియాలో జారుడు బల్ల, మేరిగో అరౌండ్ వంటివి ఏర్పాటు చేశారు. చాపరాయి చుట్టూ విద్యుత్ దీపాల ఏర్పాటు, కొలను దాటేందుకు ఐరన్ ఆర్చ్ ఏర్పాటు చేశారు. దీంతో చాపరాయిలో సమస్యలకు చెక్ పెట్టినట్లయిందని పర్యాటకులు చెబుతున్నారు.

రూ.90 లక్షలతో పీహెచ్‌సీలో సౌకర్యాల కల్పన

దుంబ్రిగుడ పీహెచ్‌సీలో నాడు–నేడు నిధులు రూ.90 లక్షలు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు. అన్ని సౌకర్యాలు కల్పించారు. మరో రూ. 30 లక్షలతో శిశు జనన నిర్మాణ కేంద్రం (బర్త్ వెయిటింగ్ హాల్) అందుబాటులోకి తెచ్చారు.

రూ.1 20 లక్షలతో చాపరాయి నుంచి పెదపాడు, కోసంగి రహదారుల నిర్మాణం

దశాబ్దాలుగా అధ్వాన రోడ్లపై అష్టకష్టాలు పడుతున్న గిరిజనులకు వైఎస్సార్‌సీపీ పాలనలో మేలు జరిగిందని చెప్పొచ్చు. ఈ మేరకు చాపరాయి నుంచి పెదపాడు వరకు రూ. 80 లక్షలతో రహదారి నిర్మించారు. మరో వైపు చాపరాయి నుంచి కోసంగి వరకు రూ. 40 లక్షలు వెచ్చించి రహదారి నిర్మించి గిరిజనుల కష్టాలు తీర్చారు.

రూ.1.15 కోట్లతో సచివాలయం, ఆర్బీకే, తదితర పనులు

దుంబ్రిగుడలో రూ. 76.75 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.20 లక్షల చొప్పున వెచ్చించి రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌ల పనులు చేపట్టారు. ప్రస్తుతం ఇవి నిర్మాణ దశలో ఉన్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు గిరిజనులకు అందనున్నాయి.

రూ.1.41 కోట్లతో పాఠశాలల ఆధునికీకరణ

దుంబ్రిగుడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆధునికీకరణకు రూ.1.41 కోట్లు వెచ్చించారు. వీటిని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశారు. ఇంగ్లిషు మీడియం బోధన అందుబాటులో తీసుకువచ్చారు.

అన్ని సౌకర్యాలు కల్పించారు



పీహెచ్‌సీలో పాత భవనం మరమ్మతు చేశారు. ఇన్ పేషెంట్ రోగుల కోసం ఐదు బెడ్లు ఏర్పాటు చేశారు. లేబర్ రూమ్, తల్లి బిడ్డల వార్డు, బర్త్ వెయిటింగ్ హాళ్లు నిర్మించారు. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించారు. రోగులకు, వైద్యులకు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేవు.

– డాక్టర్ పాంగి రాంబాబు, దుంబ్రిగుడ పీహెచ్‌సీ

రవాణా కష్టాలు తీరాయి



దుంబ్రిగుడ– గుంటసీమ రోడ్డు కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత మరమ్మతులు చేసి తారురోడ్డు వేయడంతో మా కష్టాలు తీరాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– గొల్లోరి గంగులు, గుమ్మగుడ గ్రామం, దుంబ్రిగుడ మండలం


ఏకలవ్య పాఠశాల భవనం


బర్త్ వెయిటింగ్ హాల్


సచివాలయ భవనం


ప్రాథమిక పాఠశాల

క్లుప్తంగా

దివ్యాంగ చిన్నారుల గుర్తింపు

కొయ్యూరు: అంగవైకల్యం కలిగిన ఆరేళ్లలోపు చిన్నారుల వివరాలు నమోదు చేయాలని సీడీపీవో విజయకుమారి అంగన్‌వాడీ వర్కర్లను ఆదేశించారు. ఆమె గురువారం మాట్లాడుతూ తలసేమియా, హిమోఫిలియా, సికిల్ సెల్, చెవిటి, అంధత్వం, కండరాల బలహీనత, తక్కువ దృష్టి, వినికిడి లోపం, మరుగుజ్జతత్వం లాంటి వివిధ రకాల అంగవైకల్యం కలిగిన వారి వివరాలు నమోదు చేయాలన్నారు. అలాంటి పిల్లలు ఏ కేంద్రంలో ఉన్నా ముందుగా సంబంధిత సూపర్‌వైజర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేస్తామన్నారు. వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తుందని చెప్పారు.

పాడేరులో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం


పోతురాజు

కొయ్యూరు: పాడేరులో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని నియోజకవర్గ బూత్ కమిటీ ఇన్‌చార్జి పొట్టిక పోతురాజు గురువారం తెలిపారు. గిరిజనులకు ఐదు సంవత్సరాల్లో ఎన్నో సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న వారికి పట్టాలు లేకపోవడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాటిని ఇచ్చారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మడం లేదన్నారు.

'విత్తనాలు ఉచితంగా అందజేయాలి'

చింతూరు: వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే రైతులకు సకాలంలో విత్తనాలు అందజేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య కోరారు. గురువారం చింతూరులో ఆయన మాట్లాడుతూ రైతులకు వరి, కంది, జొన్న, మొక్కజొన్న, అపరాల విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీ ధరలకు అందించాలని, రైతుల వ్యవసాయ భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాలుదొర, జోగమ్మ, మంగిరెడ్డి, ప్రసాద్, పొదయ్య, లచ్చిరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

ఎంపీడీవో క్వార్టర్స్‌లో చెత్త తొలగింపు


ఎంపీడీవో క్వార్టర్స్‌లో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవో క్వార్టర్స్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంపై 'దుర్గంధంతో సతమతం' అనే శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఇక్కడ క్వార్టర్స్‌లో పలు చోట్ల చెత్తాచెదారాన్ని పంచాయతీ కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు తొలగించారు. ప్రత్యేక ట్రాక్టర్‌లో ఊరు బయట డంపింగ్ యార్డుకు తరలించారు. దీంతో పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీమన్నారాయణ భక్తుల పాదయాత్ర


పాదయాత్ర నిర్వహిస్తున్న ఆంజేయస్వామి మాలధారణ భక్తులు

జి.మాడుగుల: స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో మండలంలో సాడేక్, బొంజంగి, తడగొంది, సాడేక్ కాలనీ గ్రామాల్లో గురువారం శ్రీమన్నారాయణ భక్తులు పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ ధర్మ ప్రచారం, శ్రీమన్నారాయణ నామ సంకీర్తన నిర్వహించారు. సాడేక్ గ్రామానికి చెందిన ఆంజనేయ స్వామి మాలధారి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు గబ్బాడి శేఖర్ స్వగృహంలో భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం జరిగింది. పలు గ్రామాలకు నుంచి వచ్చిన భక్తులకు, గిరిజనులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు, సంఘం నాయకులు ఎ.శ్రీను, రామానందం, బాలరాజు, మత్స్యలింగం ఆచారి, కె. నాయుడు, ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

మ్యూటేషన్‌పై చైతన్యవంతులు కావాలి


చెరకుంపాకల్లో మ్యూటేషన్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు రామకృష్ణ

చింతపల్లి రూరల్: మ్యూటేషన్‌పై గిరిజనులు చైతన్యవంతులు కావాలని తహసీల్దారు టి.రామకృష్ణ తెలిపారు. మండలంలో కిటుముల, లోతుగెడ్డ బందబయలు, చెరకుంపాకలు, లింగాలగుడి గ్రామాల్లో గురువారం గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చే భూమిని హక్కుదారులు తప్పక మ్యూటేషన్ చేయించుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల భూముల్లో కుటుంబ సభ్యులకు సమాన హక్కు ఉంటుందన్నారు. మ్యూటేషన్ చేయించుకోవడం వల్ల ఆ భూమికి సంబంధించిన వారికి సర్వ హక్కులు వస్తాయని, అలా చేస్తేనే ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులవుతారన్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమై ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి వివరాలను అందించాలని ఆదేశించారు. ఈ అంశంపై శిక్షణ ఇచ్చారని తెలిపారు. ముందుగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి ఫారం –7 ద్వారా నోటీస్ అందించి, తర్వాత ఫారం –5 ద్వారా ఆక్రమణలను తొలగిస్తామని ఆయన తెలిపారు.

పెదబయలు క్రికెట్ టోర్నీ విజేత ఎన్‌సీసీ ఉడీలం


ఫైనల్ మ్యాచ్ ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు


టోర్నీ విజేత ఉడీలం జట్టుకు ట్రోఫీ, నగదు అందిస్తున్న స్పాన్సర్లు

పెదబయలు: మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదపడతాయని సీతగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ కిముంకరి బొంజుబాబు తెలిపారు. గురువారం పెదబయలులో మోదకొండమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా క్రికెటర్స్ మెమోరియల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను వారు ప్రారంభించారు. మండలంతోపాటు ముంచంగిపుట్టు నుంచి పాల్గొన్న 32 జట్లతో ఇక్కడ 25 రోజుల పాటు పోటీలు నిర్వహించారు. చివరి రోజు కిక్ బాయ్స్ (అడుగులపుట్టు), ఎన్‌సీసీ ఉడీలం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కిక్ బాయ్స్ జట్టు 15 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎన్‌సీసీ ఉడీలం జట్టు 14.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి మూడు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. విన్నర్ జట్టుకు ట్రోఫీ, రూ.20 వేలు, రన్నరప్ జట్టుకు ట్రోఫీ, రూ.10 వేలు స్పాన్సర్లు అందజేశారు. ఆదివాసీ జీవన మిత్ర స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గండేరు జీవన్‌కుమార్, క్రికెట్ లవ్వర్స్ టీం పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో ముందస్తు చర్యలు

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


మాట్లాడుతున్న ఏపీవో శ్రీకాంత్

కూనవరం: మండలంలో జూలై, ఆగస్టులో వచ్చే గోదావరి వరదల నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సచివాలయంలో బఫర్ స్టాక్, నిత్యావసరాలు నిల్వ ఉంచాలని, పునరావాస కేంద్రాల్లో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని, ఫ్లడ్ షెల్టర్ల వద్ద తాగునీటి బోర్లు వేయాలని సూచించారు. వరదల సమయంలో లాంచీలపై తెచ్చిన సరకులను పునరావాస కేంద్రాల వద్దకు డంపింగ్ చేసే ఖర్చులను ప్రభుత్వం భరించాలని కోరారు. ఉపాధి కూలీలకు తక్కువ వేతనాలు పడుతున్నాయని ప్రశ్నించగా, ఎంతపని చేస్తే అంత మేరకు వేతనాలు పడుతున్నాయని ఏపీవో శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇ.ప్రేమ్ సాగర్, వైస్ ఎంపీపీలు కొమరం పెంటయ్య, బండారు సాంబశివరావు, ఎంపీటీసీలు కొమ్మాని అనంతలక్ష్మి, ధర్ముల అమ్మాజీ, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు


అచ్యుతాపురం రోడ్డులో వాహనాలపై కేసులు నమోదు చేస్తున్న ఆర్టీవో కె.వి.ప్రకాష్

తుమ్మపాల: నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై ఓవర్‌లోడ్‌తో ప్రయాణించే వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాష్ అన్నారు. పట్టణంలో అచ్యుతాపురం రోడ్డుపై గురువారం రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక సంఖ్యలో వాహనాలకు జరిమానాలు విధించారు. రెండు రోజులుగా చేపట్టిన డ్రైవ్‌లో రూ.10 లక్షల వరకు జరిమానాలు వేశామన్నారు.

గ్రామాల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్


స్ప్రేయింగ్ చేపడుతున్న దృశ్యం

అనంతగిరి: కలెక్టర్ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలతో పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలో దోమల నివారణకు ముమ్మరంగా స్ప్రేయింగ్, ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామని కార్యదర్శి ఉమాదేవి గురువారం తెలిపారు. మలేరియా కేసులు నమోదవుతున్న గ్రామాల్లో సిబ్బందితో కలిసి, దోమల నివారించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గిరిజనులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేశామన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటించాలని, మురుగు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. వారంలోని ఒకరోజు డ్రైడే నిర్వహించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోని గ్రామస్తులు పాల్గొన్నారు.

కశింకోటలో కార్డన్ సెర్చ్


కశింకోటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు, కారు

కశింకోట: కశింకోటలో సరైన రికార్డులు లేని 46 బైకులను, కారు, ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐ రమేష్ బాబు, అలీల ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలోని గవరపేట, హౌసింగ్ కాలనీ, జాషువా కాలనీ, ఎస్సీ కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆ సమయంలో సరైన రికార్డులు లేని బైక్‌లను, కారు, ఆటో స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. వీటికి రికార్డులు ఉంటే ఆధారాలు చూపి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సీఐ కోరారు. ఇళ్ల ముందు పెట్టే బైక్‌లు దొంగతనాలకు గురి కాకుండా వాటికి పటిష్టవంతంగా లాక్‌లు వేసుకొని భద్రపరచుకోవాలని వాహన చోదకులకు సూచించారు.

ఉచిత టైలరింగ్, బ్యూటీపార్లర్‌పై శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న శచీదేవి

అనకాపల్లి : మహిళలు స్వశక్తితో ఎదగాలని, ఆర్థికంగా బలపడితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. స్థానిక పూడిమడక రహదారి భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ డ్వాక్రా గ్రూపు సంఘాలలో చేరాలని తద్వారా శిక్షణ అనంతరం యూనిట్ స్థాపించుకోవడానికి తగిన ఆర్థిక సహాయం ద్వారా డ్వాక్రా రుణం పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ప్రైవేట్ ఉద్యోగాల ఒత్తిడి కారణంగా స్వయం ఉపాధి అనేది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ టైలరింగ్, బ్యూటీపార్లర్ శిక్షణ 30 రోజులు ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, రెండు జతల యూనిఫాం, టూల్‌కిట్స్, బ్యాంక్‌ల ద్వారా రుణాలు, పర్సనల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ డైనీ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు


అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు

గంగవరం: పాఠశాలల్లో విద్యార్థులకు పీఎం పోషణ ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో మెనూ ప్రకారం పెట్టాలని పీఎం పోషణ జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాంబాబు తెలిపారు. గురువారం స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవో టి. మల్లేశ్వరరావు అధ్యక్షతన మధ్యాహ్న భోజన పథకం అమలుపై మహిళలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎండీఎం మెనూ, నాణ్యత, పరిమాణం, పోషక విలువలు గురించి అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు మాట్లాడుతూ పీఎం పోషణ పథకాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఎండీఎం ద్వారా విద్యార్థులకు శుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్యం ఉంటారని, విద్య బాగా నేర్చుకుంటారన్నారు. ఎండీఎం మహిళలు మధ్యాహ్న భోజనంలో పాటించాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఎంఈవో–2 మల్లేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని 56 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే 82 మంది మహిళలకు అవగాహన కల్పించామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం


పెద్దతమ్మింగులలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రమేష్ తెలిపారు. గురువారం జర్జుల పంచాయతీ పెద్దతమ్మింగుల గ్రామంలో కిలగాడ పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. 64 మందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. వేసవిలో ఆరోగ్యపరమైన సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వేసవిలో వేడి, తేమతో కూడిన పరిస్థితుల వల్ల డీహైడ్రేషన్ కలుగుతుందని, చెమట ద్వారా నీరు, లవణాలు కోల్పోతామన్నారు. ఎండలో శ్రమతో కూడిన పనులకు దూరంగా ఉండాలని, వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. జ్వరాలు, గొంతునొప్పి, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు వంటివి వస్తాయని తగు జాగ్రత్తలు పాటించాలని, నీరు ఎక్కువగా తాగడం, తేలికపాటి వస్త్రాలు ధరించడం, వంటివి చేయాలని సూచించారు. ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబా మందిరం వద్ద అన్నదానం


రాజవొమ్మంగిలో పూజలందుకుంటున్న షిర్డీసాయి బాబా


అన్నదాన కార్యక్రమంలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరం వద్ద గురువారం భారీ అన్నసంతర్పణ జరిగింది. విశేషంగా భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం ఆలయంలో పురోహితుడు భానుమూర్తి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండుటెండను లెక్క చేయకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి బాబా దర్శనం కోసం భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. బాబా వారికి నైవేద్య సమర్పణ, మధ్యాహ్నం హారతి అనంతరం భజన సంకీర్తనల్లో పాల్గొన్నారు.